
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 19 మార్చి 2025



అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పులు చేసినట్టు మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఎండల కారణంగా చిన్నారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మే 31 వరకూ ఈ సమయాన్ని కొనసాగిస్తామన్నారు. చిన్నారులకు వేడి భోజనం పెట్టి.. వారి గృహాలకు పంపాలని సిబ్బందికి సూచించారు.

ఎన్ని లోడ్లు కావాలి?



ఆకులతంపర వద్ద వంశధార నదిలో రాత్రివేళ ఇసుక అక్రమ తవ్వకాలు



- పగలంతా సమాచారం సేకరణ
- రాత్రివేళ యంత్రాలతో తవ్వకాలు..
- ఆపై గుట్టుచప్పుడు కాకుండా రవాణా
- ఇదీ ఆకులతంపర ఇసుక రీచ్ వద్ద బాగోతం
- అధికారపార్టీ నేతల అనుచరుల హల్‌చల్
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద వంశధార నదీ గర్భంలో రాత్రివేళ ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఆ ఇసుకను లారీల్లో లోడింగ్ చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. అధికారపార్టీ నేతల అనుచరులమంటూ అక్రమాలు కొనసాగిస్తున్నారు. రీచ్ వద్ద బడా నాయకుడి అనుచరులుగా పేరు చెప్పుకుని ప్రతిరోజూ ఎవరికి ఎన్ని లోడ్లు ఇసుక కావాలో పగలంతా సమాచారం సేకరిస్తున్నారు. రీచ్‌ల వద్ద ఉన్న వ్యక్తులకు ఫోన్ చేసి.. రాత్రివేళ తమ లారీలు వస్తాయని లోడింగ్ చేసేందుకు బేరసారాలు మాట్లాడతారు. లారీ లోడ్‌కు రూ.10వేల నుంచి రూ.16వేల వరకూ చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంటారు. పగలంతా సమీప తోటల్లో ఉంచిన పొక్లయినర్లను రాత్రివేళ వంశధార నదీ గర్భంలో దించి.. ఇసుక తవ్వకాలు చేపట్టి.. రవాణా చేస్తున్నారు. పగలు మళ్లీ ఆ యంత్రాలను ఎవరికీ కనిపించకుండా తోటల్లో ఉంచుతున్నారు. రాత్రివేళ గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం సచివాలయ, రెవెన్యూ సిబ్బందికి తెలిసినా చూసీచూడనట్టు ఉండడం విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వం మారినా.. అంతే!

వైసీపీ హయాంలో ఇసుకను అధిక ధరలకు (మిగతా 6వ పేజీలో..)

సచివాలయాల ప్రక్షాళన

- జిల్లాలో 360 క్లస్టర్ల ఏర్పాటుకు కసరత్తు
- టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా సిబ్బంది విభజన
- జనాభా ప్రాతిపదికన సర్దుబాటు
- మిగిలిన వారిని ఇతర శాఖలకు కేటాయింపు
- ఈ నెల 25 నాటికి కొలిక్కిరానున్న ప్రక్రియ



సచివాలయాల్లో సిబ్బంది ఇలా..

మండలం/మునిసిపాలిటీ	సచివాలయాలు	సిబ్బంది
బూర్జ	16	153
ఎల్.ఎన్.పేట	12	117
కోటబొమ్మాళి	27	255
గార	26	239
పలాస	16	148
జి.సిగడాం	21	202
రణస్థలం	28	246
పోలాకి	23	222
జలుమూరు	24	238
నరసన్నపేట	24	226
ఎచ్చెర్ల	28	239
టెక్కలి	20	187
లావేరు	23	216
మెళియాపుట్టి	21	193
నందిగాం	22	200
సంతబొమ్మాళి	20	181
హిరమండలం	13	121
పాతపట్నం	18	176
సోంపేట	24	180
కొత్తూరు	27	235
మందస	29	212
వజ్రపుకొత్తూరు	27	209
కంచిలి	22	155
పొందూరు	27	244
శ్రీకాకుళం రూరల్	28	249
ఇచ్ఛాపురం (రూరల్)	16	108
ఆమదాలవలస(రూరల్)	19	184
సరుబుజ్జిలి	14	131
సారవకోట	20	202
కవిటి	22	155
శ్రీకాకుళం (అర్బన్)	38	344
ఇచ్ఛాపురం (అర్బన్)	10	60
పలాస-కాశీబుగ్గ (అర్బన్)	16	128
ఆమదాలవలస (అర్బన్)	11	101
మొత్తం	732	6,456

నరసన్నపేట/టెక్కలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సచివాలయాల ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి.. గ్రేడ్-4 పంచాయతీల్లో 72 మందిని నియమించింది. ఇక సచివాలయల్లో ఉన్న 11 మంది ఉద్యోగులను రెండు కేటగిరీలుగా విభజించి. రెండేసి సచివాలయాలను ఒక్క క్లస్టర్‌గా పరిగణించి.. సిబ్బందిని సర్దుబాటు చేయనుంది. ఈ మేరకు జనాభా అధారంగా సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించేందుకు పంచాయతీ రాజ్ శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ఈవోపీఆర్డీలు జనాభా ప్రతిపాదికన లెక్కలను సేకరించి జిల్లా అధికారులకు సమాచారం అందజేశారు. జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాలు 732 ఉన్నాయి. ఒక్కో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ లేదా ఉద్యానశాఖ అసిస్టెంట్, మహిళా పోలీసు, సర్వేయర్, వీఆర్వో ఇలా సగటున 11 మంది ఉద్యోగులు ఉండాలి. ఈ మేరకు జిల్లాలోని సచివాలయాల్లో 8,052 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ చేయలేదు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కేడర్‌కు చెందిన ఉద్యోగులు 6,456 మంది మాత్రమే ఉన్నారు. కొన్ని సచివాలయాల్లో పదిమందికిపైగా సిబ్బంది ఉండగా, అత్యధిక సచివాలయాల్లో సగం కన్నా తక్కువ మంది ఉన్నారు. కొన్ని చోట్ల ఇద్దరు.. ముగ్గురు మాత్రమే విధులు (మిగతా 6వ పేజీలో..)



మద్యం తాగి.. విచక్షణ మరిచి..

- భార్యను చంపేశాడు
- గొడవపడి తలపై, మెడపై కత్తితో దాడి
- అనుమానంతో ఘాతుకం


భర్త అప్పలరెడ్డితో నాగమ్మ (ఫైల్)

ఎచ్చెర్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మూడు ముళ్ల బంధాన్ని, ఏడడుగుల అనుబంధాన్ని మరిచిన ఆ వ్యక్తి భార్యను నిర్దాక్షిణ్యంగా హత్యచేశాడు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోయి కిరాతకుడిగా వ్యవహరించాడు. గ్రామంలో అంతా నిద్రలోకి జారుకున్న సమయంలో భార్యను ఇంట్లోనే కత్తితో దాడి చేసి కడతేర్చాడు. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం గ్రామానికి చెందిన నాగమ్మ(42).. భర్త అప్పలరెడ్డి చేతిలో సోమవారం రాత్రి హతమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె. కుమారుడు త్రినాథ్ విశాఖపట్నంలో తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుమార్తె పార్వతికి 2020లోనే వివాహం చేయగా.. భర్తతో కలిసి విశాఖపట్నంలోనే ఉంటోంది. ప్రస్తుతం నాగమ్మ, అప్పలరెడ్డి మాత్రమే స్వగ్రామంలో నివసిస్తున్నారు. నీలగిరి, సరుగుడు తదితర తోటలు కొడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న అప్పలరెడ్డికి మద్యం తాగే అలవాటు ఉంది. నిరంతరం భార్యను అనుమానిస్తూ, అవమానిస్తుండేవాడు. ఈ క్రమంలో (మిగతా 8వ పేజీలో..)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జేఆర్‌పురం సీఐ, ఎచ్చెర్ల ఎస్ఐ

అలంకారప్రాయంగా అగ్రిల్యాబ్స్

- అనేకచోట్ల పరికరాలు అమర్చని వైనం
- పరీక్షల ఊసేలేదు
- సిబ్బంది లేక అవస్థలు

6లో

ఎండుతున్నాయ్!

- పొలాలు, చెరువుల్లో నీరు లేక అల్లాడుతున్న రైతులు
- బోరుబావుల్లోనూ తగ్గిన నీటిమట్టం

8లో



పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

7లో

ఇస్రో రమ్మంటోంది

- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- దరఖాస్తుకు గడువు తేదీ 23

6లో

'వంశధార'లో ఉద్యోగుల కొరత

- ఇద్దరు డీఈఈలు, 14 మంది ఏఈ పోస్టుల ఖాళీ
- కాలువల నిర్వహణ సక్రమంగా లేక అవస్థలు


టెక్కలి సమీపంలో కాలువ ఇలా..

టెక్కలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమకాలువ పరిధి టెక్కలి డివిజన్ కార్యాలయంలో సరిపడా ఉద్యోగులు లేరు. అరకొర సిబ్బందితోనే విధులు నెట్టుకొస్తున్నారు. నలుగురు డీఈఈలకుగానూ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 17 మంది ఏఈలకుగానూ ముగ్గురు మాత్రమే ఉన్నారు. 14 ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక జేటీవో పోస్టు ఖాళీగా ఉంది. సీనియర్ సహాయకులుగా ఉన్న ఒకరు విజిలెన్స్ విభాగానికి వెళ్లగా, మరొకరు అంధ మహిళా కావడంతో కార్యాలయ పనులు తలకుమించిన భారంగా మిగిలాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరే.. కార్యాలయంలో అన్ని పనుల బాధ్యతలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి దాపురించింది.

వంశధార ప్రధాన ఎడమకాలువ ద్వారా 55.725 కిలోమీటరు నుంచి 104 కిలోమీటర్ల శివారు ప్రాంతం వరకు సుమారు 42వేల ఎకరాలకు సాగునీరందిస్తుంది. వంశధార ప్రధాన ఎడమకాలువ పరిధిలో 16ఏళ్లుగా షట్టర్ల మరమ్మతులు చేపట్టలేదు. యూటీ, రెగ్యులేటర్, లైనింగ్ పనులు కూడా నిర్వహించలేదు. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరా సక్రమంగా అందడం లేదు. 48ఆర్ నౌపడ మేజర్, 60ఆర్ మర్రిపాడు మేజర్, 67, 68 టైలాండ్ ప్రాంతాలకు సాగునీరు వెళ్లాలంటే సమస్యగా మారింది. వాస్తవానికి వంశధార ప్రధాన ఎడమకాలువ వెంబడి 2,480 క్యూసెక్కులు డిజైన్ చేసినా, టెక్కలి ప్రాంతానికి 600 క్యూసెక్కులు కూడా రాని పరిస్థితి నెలకొంది. వంశధార కాలవ పరిధిలో ఎస్ఆర్ ఈజీఎస్, డిజిస్టర్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేపట్టాల్సి ఉంది. పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది లేక పనుల నిర్వహణ ప్రశ్నార్థకమవుతోంది. ప్రభుత్వం స్పందించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఈఈ బి.శేఖరరావు వద్ద ప్రస్తావించగా.. పోస్టుల ఖాళీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో భర్తీ చేసే అవకాశం ఉందని తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ

- 150 గజాలలోపు ఉచిత రిజిస్ట్రేషన్
- కుటుంబంలో మహిళ పేరుతో పట్టా
- గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీల స్వీకరణ



ఇచ్ఛాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని.. నివాసం ఉంటున్న పేదలకు ఆయా స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం సొంత పార్టీవాళ్లకు మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటికే ప్రభుత్వ స్థలాల్లో పాకలు, రేకులషెడ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నవారి గురించి పట్టించుకోలేదు. ఇటువంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు మాత్రమే దీనిని అమలు చేయాలని అధికారులకు ఆదేశించింది. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబరు 15 తేదీకి ముందు నుంచీ నివాసం ఉంటున్న వారికి మాత్రమే ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. 150 గజాలలోపు స్థలంలో నివాసం ఉంటే ఉచిత రిజిస్ట్రేషన్ చేయనుంది. 150 గజాల నుంచి 450 గజాల వరకు స్థలానికి రిజిస్ట్రేషన్ విలువలో 50శాతం చెల్లించాలి. ప్రభుత్వ స్థలాల్లో ఇటుకల గోడపై సిమెంట్ రేకులతో వేసిన షెడ్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఆ ఇంట్లో నివాసం ఉంటున్నవారికి రాష్ట్రంలో మరెక్కడా సొంత ఇంటి జాగా లేకపోతేనే క్రమబద్ధీకరణ చేస్తారు. కుటుంబంలో మహిళ పేరుతో ఇంటి పట్టా అందజేస్తారు. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు స్వీకరించనున్నారు. సర్వేయర్లు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం తహసీల్దార్లకు నివేదిక అందజేస్తారు. కాగా.. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేసినా ఈ పథకానికి అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. అలాగే పది ఎకరాలకు మించి మెట్టు, ఐదు ఎకరాలకు మించి మాగాణి భూమి ఉన్నా అనర్హులుగా పరిగణిస్తారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, కార్లు, వ్యవసాయం కోసం వినియోగించే ట్రాక్టర్లు, రవాణా ట్రక్కులున్న వారికి కూడా ఈ పథకం వర్తించదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గతంలో స్థలం, ఇల్లు పొంది ఉన్నా.. ఈ పథకానికి అనర్హులేనని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఈ విషయమై ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎన్.వెంకటరావు వద్ద ప్రస్తావించగా.. 2019 అక్టోబరుకు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న నిరుపేదల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

అలంకారప్రాయంగా అగ్రిల్యాబ్స్

- సిబ్బంది లేక అవస్థలు
- అనేకచోట్ల పరికరాలు అమర్చని వైనం
- పరీక్షల ఊసేలేదు

సోంపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికత, విత్తనాలు, పరికరాలకు సంబంధించిన నాణ్యతా పరమైన సమస్యలు అధిగమించడానికి గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు వెచ్చించి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లాలో సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, రణస్థలం, ఆమదాలవలస, శ్రీకాకుళంలో అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ముందు హడావుడిగా వాటిని ప్రారంభించారు. ప్రస్తుతం పనిచేస్తున్న వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించారు. వివిధ పంటలకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల నాణ్యతను ల్యాబుల్లో పరీక్షించి..నివేదికలను రైతుల దృష్టికి తీసుకెళ్లాలి. నేల స్వభావానికి అనుగుణంగా పంటలు సాగుచేసేలా అవగాహన కల్పించాలి. ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగా అన్ని అంశాలను పరీక్షించి రైతులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో ల్యాబ్ పరిధి అధికంగా ఉండటంతో నియోజకవర్గంలోని రైతులందరికీ సేవలు అందించే అవకాశం లేకుండా పోయింది. జిల్లాలోని రైతులు, ఒడిశా ఇతర ప్రాంతాలకు సంబంధించిన విత్తనాలు ఎక్కువగా వినియోగిస్తుంటారు. వాటి నాణ్యతను నారు వేసే సమయంలో పరీక్షిస్తే అన్నదాతలు నష్టపోకుండా చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. వ్యవసాయ పరీక్ష కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. ఎంతమంది సిబ్బంది ఉండాలి? ఏయే విధులు నిర్వహించాలనే అంశంపై స్పష్టత లేదు. ప్రస్తుతానికి కొందరు వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులను ఇన్‌చార్జులుగా నియమించి నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ల్యాబ్, పరీక్షల నిర్వహణ, నివేదికల తయారు, ఇతర అంశాలకు సంబంధించి నిపుణులైన సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.



సోంపేటలో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్


అగ్రిల్యాబ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు

సిబ్బంది నియామకం ఎప్పుడు?

అగ్రిల్యాబ్‌లను వ్యవసాయశాఖ ఏడీల ఆధ్వర్యంలో నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ఏడీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖాధికారి, ఇద్దరు వ్యవసాయ విస్తరణాధికారులు ఉండాలి. జిల్లాలో ఒక్క పలాస అగ్రిల్యాబ్‌లో మాత్రం సిబ్బంది ఉన్నారు. మిగిలిన ల్యాబ్‌లలో సిబ్బందిని నియమించలేదు. భవనాలు నిర్మించి... పరికరాలు సమకూర్చినా.. నిపుణులు, సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీంతో కొన్ని చోట్ల తూతూమంత్రంగా పరీక్షలు జరుగుతుండగా మరికొన్ని చోట్ల పరికరాలు అమర్చేందుకు అనువుగా ఉండకపోవడంతో ప్రారంభానికే నోచుకోలేదు. ఫలితంగా భూసారం, విత్తనాల నాణ్యత వివరాలు తెలుసుకోవడం భారమవుతోంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి.. అగ్రిల్యాబ్‌లు తమకు ఉపయోగపడేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు ఎంతో మేలు



రైతులకోసం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లు అలకార ప్రాయంగా మిగిలాయి. ఇవి పూర్తిస్థాయిలో పనిచేస్తే రైతులకు సలహాలు, సూచనలు అందించే అవకాశం ఉంటుంది. ఏ సీజన్‌లో ఏపంట వేయాలో తెలుసుకొనే అవకాశం కలుగుతుంది.

- సంక గోపి, రైతు, పలాసపురం

విత్తనాల నాణ్యత తెలుస్తుంది



అగ్రిల్యాబ్‌లు సక్రమంగా పనిచేస్తే విత్తనాల నాణ్యత తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పక్క రాష్ట్రమైన ఒడిశా నుంచి ఎక్కువగా తెస్తుంటారు. అక్కడి నుంచి విత్తనాలు ఎక్కువగా నాసిరకం వస్తున్నాయి. వాటి నాణ్యతను తెలిపేందుకు ల్యాబ్‌లు ఉపయోగపడతాయి.

- బి.విశ్వనాథం, రైతు, పలాసపురం

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం



అగ్రిల్యాబ్‌లో ప్రస్తుతం ఒక ఏవోతో పనిచేస్తున్నాం. వచ్చే సీజన్ నాటికి విత్తనాలను పరీక్షల కోసం సిద్ధం చేశాం. విత్తనాల సీజన్‌నాటికి వ్యవసాయాధికారిని ఇన్‌చార్జిగా నియమించే అవకాశాలు ఉన్నాయి. ఎరువుల పరీక్షల కోసం పరికరాలు అమర్చాల్సి ఉంది. సంబంధిత కంపెనీ వారు పరికరాలను అమరిస్తే ఎరువుల పరీక్షలు చేస్తాం.

- కె.జగన్మోహనరావు, ఏడీ, సోంపేట

ఇస్రో రమ్మంటోంది



- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు గడువు తేదీ 23

శ్రీకాకుళం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది. అంతరిక్ష విజ్ఞానంపై తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇస్రో ఏడాదికోమారు యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. దీని కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచడంతో పాటు వారికి స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించే దిశగా ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనికోసం ఈ ఏడాది ఫిబ్రవరి 24న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉంది.

ఎవరు అర్హులంటే..

యువికాలో భాగంగా ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23 వరకూ ఆన్‌లైన్‌లో డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఐఎస్ఆర్ఓ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చును. ఎనిమిదో తరగతిలో వచ్చిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. వీటితో పాటు స్పేస్, సైన్స్‌క్లబ్‌లలో ఉంటే మరో 5 శాతం వెయిటేజీ ఇస్తారు. వీటితో పాటు సైన్స్ క్లబ్‌లలో జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో సైన్స్ వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచి ఉంటే అదనంగా 10 శాతం వెయిటేజీ ఇస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్‌గా ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 20 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 5 శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఇదీ షెడ్యూల్

- ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తారు.
- మే 18న విద్యార్థులను ఆహ్వానిస్తారు.
- మే 19 నుంచి 30 వరకూ యువికా - 2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- మే 31న ముగింపు సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.
- యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, వసతి, భోజన సదుపాయాలను ఇస్రో ఉచితంగా సమకూరుస్తుంది.
- 14 రోజుల పాటు..

యువికా కార్యక్రమంలో ఎంపికైన వారిని 14 రోజుల పాటు ఇస్రోకి చెందిన వివిధ రాష్ట్రాలలోని స్పేస్ కేంద్రాలకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, నవగ్రహాల సముదాయం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం కల్పిస్తారు.

ఏడు కేంద్రాలలో..

అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) దేశంలోని ఏడు కేంద్రాలలో యువికా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మన రాష్ట్రంలోని సూళ్లూరుపేట, డెహ్రాడూన్(ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), బెంగళూర్, (కర్ణాటక) అహ్మదాబాద్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), షిల్లాంగ్ (మేఘాలయ)లలో ఇస్రో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.



అమ్మకు పుణ్యక్షేత్రాలు చూపించాలని..

- స్కూటర్‌పై 'మాతృ సేవ సంకల్ప యాత్ర'
- మైసూరుకు చెందిన వ్యక్తి ప్రయత్నం


స్కూటర్‌లో తల్లిని తీసుకెళుతూ..

ఇచ్ఛాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధులైన కన్నవారిని భారంగా భావిస్తున్న ఈ రోజుల్లో...దీనికి భిన్నంగా మాతృమూర్తి కోసం నెలకు రూ.రెండు లక్షలకు పైగా వేతనం వస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాడా వ్యక్తి. తల్లి కోర్కె తీర్చేందుకు ఆమెతో పాటు భారత దేశంలోని పుణ్యక్షేత్రాల సందర్శనకు స్కూటర్‌పై బయలుదేరాడు. ఆయనే కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దక్షిణామూర్తి కృష్ణకుమార్. తన స్కూటర్‌పై తల్లిని తీసుకొని దేశంలో ఉన్న పుణ్యక్షేత్రాలు అన్నింటినీ స్వయంగా చూపిస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా ఇటీవల ఇచ్ఛాపురం పట్టణానికి చేరుకున్నారు. ఈ తల్లీకొడుకులను కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకులు ఆర్.జయకృష్ణ తన ఇంటికి తీసుకెళ్లారు. వాస్తవానికి 2018లో ఆయన ఈ యాత్ర ప్రారంభించారు. దీనికి 'మాతృసేవ సంకల్ప యాత్ర' అని పేరు పెట్టారు. 2020లో కొవిడ్ రావటంతో కొంతకాలం విరామం ఇచ్చారు. అప్పుడు పూరీ నుంచి వస్తూ ఇచ్ఛాపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఒకరోజు ఆశ్రయం పొందారు. కొవిడ్ వల్ల అప్పుడు పూరీ క్షేత్రాన్ని దర్శించుకోలేకపోయారు. దీంతో తల్లికి పూరీ జగన్నాథుని చూపించేందుకు ఇటీవల ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన యాత్ర వివరాలు తెలిపారు. జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి.. తండ్రి జ్ఞాపకార్థంగా మిగుల్చుకున్న పాత బజాజ్ చేతక్ స్కూటర్‌పై 2018 జనవరి 16న భారతదేశంలోని పుణ్య క్షేత్రాల సందర్శనకు శ్రీకారం చుట్టానని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 97,200 కిలోమీటర్లకు పైగా యాత్రను పూర్తి చేసుకున్నామని చెప్పారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కోల్‌కత్తా, అరుణాచల్ ప్రదేశ్‌తో పాటు నేపాల్, భూటాన్, మయన్మార్‌ను కూడా సందర్శించానని తెలిపారు. తన తల్లి వయసు 73 సంవత్సరాలు అని చెప్పారు. ఇప్పటి వరకు తిరిగిన అన్ని ప్రాంతాల్లోనూ మంచి ఆదరణ లభించటమే కాకుండా తమ యాత్ర విషయం తెలిసి.. అందరూ అభినందించడం ఎంతో ఆనందాన్నిస్తోందన్నారు.


ఇచ్ఛాపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకుడి ఇంట్లో..

సచివాలయాల ప్రక్షాళన

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నా.. చాలా మందికి సరైన పని ఉండడం లేదనే విమర్శలున్నాయి. తక్కువ మంది సిబ్బంది ఉన్న చోట పనిభారం అధికంగా ఉంది. ఈ పరిస్థితులను చక్కదిద్ది సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం జనాభా ఆధారంగా ఉద్యోగులను సర్దుబాటు చేయనుంది. 3,500 మంది.. అంతకన్నా ఎక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు ఎనిమిది మంది సిబ్బందిని కేటాయించనుంది. 2,500 నుంచి 3,500 వరకు జనాభా ఉంటే ఏడుగురు, 2,500 కన్నా తక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు ఆరుగురు వంతున ఉద్యోగులను కొనసాగించనుంది. ఇంజనీరింగ్, వ్యవసాయశాఖల్లో టెక్నికల్ సిబ్బందిని రెండు సచివాలయాలకు ఒకరిచొప్పున సర్దుబాటు చేస్తారు. జనాభా ప్రాతిపదికన సచివాలయాల్లో ఉద్యోగులను సర్దుబాటు చేసిన తర్వాత ఇంకా మిగిలిన ఉన్న ఉద్యోగులను సంబంధిత శాఖలకు కేటాయిస్తారు. జిల్లాలో 360 క్లస్టర్లుగా విభజించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈనెల 25 నాటికి ఉద్యోగులను సర్దుబాటు చేసి.. ఉగాది నుంచి క్లస్టర్ వ్యవస్థ అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

కేటగిరీలు ఇలా..

సచివాలయ సిబ్బందిని బహుళార్థక, సాంకేతిక, ఆకాంక్షల కార్యనిర్వాహకులుగా విభజిస్తారు. బహుళార్థక కార్యనిర్వాహకులుగా పంచాయతీ కార్యదర్శిని వార్డు ఎడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా, డిజిటల్ అసిస్టెంట్‌ను వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రోసెసింగ్ సెక్రటరీగా, వెల్ఫేర్ అసిస్టెంట్‌ను వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా, గ్రామ మహిళా పోలీస్‌ను వార్డు మహిళా పోలీస్‌గా మార్చనున్నారు. సాంకేతిక కార్యనిర్వాహకులుగా వీఆర్‌వోని వార్డు రెవెన్యూ సెక్రటరీగా, ఏఎన్ఎంను వార్డు హెల్త్ సెక్రటరీగా, సర్వే అసిస్టెంట్‌ను వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీగా, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను వార్డు ఎమినిటీస్ సెక్రటరీగా, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరీకల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ విభాగాలకు సంబంధించి వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలుగా, ఎనర్జీ అసిస్టెంట్‌ను వార్డు ఎనర్జీ అసిస్టెంట్‌గా మార్చనున్నారు. అలాగే సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ కూడా జరిగేలా ప్రతిపాదన సిద్ధం చేశారు. ఈ విషయమై జిల్లా నోడల్ ఆఫీసర్‌గా నియామకమైన పి.కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా 'క్లస్టర్ మ్యాపింగ్ కార్యక్రమం జరుగుతోంది. మొబైల్‌యాప్ ద్వారా సర్వే చేస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు రేషనలైజేషన్ ప్రక్రియ కూడా దోహదపడుతుందని తెలిపారు.


ఊరేగింపులో సాంస్కృతిక ప్రదర్శనలు

ముగిసిన పాదాలమ్మ ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగరంలో బాకర్‌సాహెబ్‌పేటలో ఉన్న దుర్గా మహాలక్ష్మి ఆలయంలో నిర్వహించిన శ్రీపాదాలమ్మ తల్లి గ్రామదేవత మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా 108 మహిళలతో ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలతో ఊరేగింపు కొనసాగింది.

పరిశ్రమల అనుమతులు పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అనుమతులకు వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మంగళవారం జూమ్ ద్వారా సమీక్షించారు. సింగిల్ డెస్క్ విండోకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. 15 దరఖాస్తులు రాగా, 13 ప్రాసెస్‌లో ఉన్నట్టు జీఎం విజయరత్నం చెప్పారు. అలాగే పీఎంఈజీపీలో 69 దరఖాస్తులు లక్ష్యం కాగా 90 మంజూరు చేశామన్నారు. ఇందుకు రూ.4.39 కోట్లు మంజూరు చేసినట్టు జీఎం స్పష్టం చేశారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా 6,559 మందికి మంజూరు చేయగా ఇందులో 5884 మందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. వీరిలో 1037 మందికి బ్యాంకు నుంచి రూ.10.37కోట్ల రుణాలను మంజూరు చేసినట్టు తెలిపారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, ఏపీఐఐసీ జెడ్ఎంఎం మురళీమోహనరావు, అగ్నిమాపక అధికారి మోహనరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.రాంబాబు, ఏడీ రఘునాథ్, ప్రోత్సాహక అధికారులు డి.రవికుమార్, ఎ.కిరణ్‌కుమార్, ఎల్డీయం సూర్యకిరణ్, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్తం కృష్ణమయమే


ప్రసంగిస్తున్న స్వామి మహారాజ్

ఇచ్ఛాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈ సృష్టి అంతా కృష్ణమయమేనని ప్రవచనకర్త త్రిదండి సన్యాసి పరమ పూజ్య భక్తి వికాస స్వామి మహారాజ్ అన్నారు. స్థానిక సురంగి రాజా మైదానంలో మంగళవారం రాత్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, శ్రవణ కీర్తన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నగర సంకీర్తన చేశారు. అనంతరం మైదానంలో నిర్వహించిన కార్యక్ర మంలో స్వామి మహారాజ్ మాట్లాడుతూ ఈ సృష్టిలో శ్రీకృష్ణుని స్మరించటం కన్నా ఉన్నతమైనది మరొకటి లేదని అన్నారు. ప్రతి సమస్యకూ శ్రీకృష్ణుని నామస్మరణతోనే పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు.

ఏ క్షణం.. ఏమవుతుందో!

- శిథిలావస్థలో పోలీసు స్టేషన్ భవనం
- ఇప్పటికి రెండుసార్లు శ్లాబు పెచ్చులూడిన వైనం
- బిక్కుబిక్కుమంటూ విధులు

నరసన్నపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పటికప్పుడు పెచ్చులు ఊడిపడుతున్నాయి. బిక్కుబిక్కుమంటూ పోలీసులు విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. 1992లో ఈ పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించారు. చాలా కాలం కావడంతో శిథిలస్థితికి చేరుకుంది. గతంలో రెండుసార్లు శ్లాబు పెచ్చులు ఊడి పడ్డాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే గది శ్లాబు పడిపోయి... గజాలు బయటకు కనిపిస్తున్నాయి. ఇదే పోలీసుస్టేషన్ మీద సీఐ కార్యాలయం గతంలో ఉండేది. అక్కడ కూడా పెచ్చులు ఊడిపోవడంతో సీఐ కార్యాలయాన్ని కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్‌దీ అదే పరిస్థితి. చిన్నపాటి వర్షం వచ్చినా కారిపోతోందని... రికార్డులు కూడా భద్రపరుచుకోవడం కష్టంగా మారిందని సిబ్బంది చెబుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని...కొత్త భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయాన్ని సీఐ శ్రీనివాసరావు వద్ద ప్రస్తవించగా..దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినట్టు వివరించారు.


శిథిలమైన గదిలోనే విధులు నిర్వహిస్తున్న దృశ్యం


శ్లాబు పెచ్చులూడిన దృశ్యం

ఎన్ని లోడ్లు కావాలి?

(ఐదో పేజీ తరువాయి)

విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకున్నారు. అప్పట్లో సామాన్యులు ఇళ్ల నిర్మాణానికి ఇసుక దొరక్క చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. రీచ్‌ల నుంచి దూరాన్ని బట్టి రవాణా చార్జీల నిమిత్తం నిర్ణీత రుసుం వసూలు చేస్తోంది. కాగా, ప్రభుత్వం మారినా ఇసుక రీచ్‌ల వద్ద అక్రమాలు మాత్రం ఆగడం లేదు. కొంత మంది అక్రమార్కులు కొత్తూరు మండలం మారుమూల ప్రాంతంలోని ఆకులతంపర రీచ్‌లో రాత్రివేళల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. రోజూ సుమారు 30 నుంచి 40లారీల్లో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రాత్రివేళ రవాణా చేస్తున్నారు. ఒక్కో లారీలోడు ఇసుకను రూ.30వేల నుంచి రూ.40 వేల వరకూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది నాయకులు వాటాలు వేసుకుని మరీ రోజూ రీచ్‌ల వద్దకు లారీలు పంపుతున్నట్టు తెలుస్తోంది. గతంలో ఈ రీచ్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేయడంతో అధికారులు రూ.లక్ష వరకూ అపరాధ రుసుం విధించారు. కానీ, ఆ మరుసటి రోజు నుంచి యథావిధిగా ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇసుక విధానంలో అధికారపార్టీ నేతలెవరూ కలుగజేసుకోవద్దని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసినా.. ఆయా నేతల అనుచరు లు మాత్రం వెనక్కి తగ్గకపోవడం చర్చనీ యాంశమవుతోంది.

- ఈ విషయమై కొత్తూరు తహసీల్దార్ రవిచంద్ర వద్ద ప్రస్తావించగా.. ఆకులతంపర వద్ద నదిలో రాత్రివేళ ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ.లక్ష అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

పర్యవేక్షణ లేక.. పనులు పూర్తి కాక



నిర్మాణదశలో శిథిలావస్థకు చేరుకుంటున్న సుబ్బపేట అంగన్‌వాడీ కేంద్రం భవనం

- నిర్మాణదశలోనే శిథిలావస్థకు చేరుతున్న వైనం
- ఇదీ సుబ్బపేట, ఇసుకలపాలెం అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి

సరుబుజ్జిలి,మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకలపాలెం పంచాయతీ పరిధిలోగల సుబ్బపేట, ఇసుకలపాలెంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు.గతంలో టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించింది.ఇంతలో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవనాల పనులు ముందుకు సాగలేదు.ఈనేపథ్యంలో ఏడేళ్ల నుంచి కనీసం పరిశీలించకపోవడంతో నిర్మాణదశలోనే భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రస్తుతం ఈ రెండుచోట్ల పక్కాభవనాలు లేకపోవడంతో సరుకుల నిల్వతోపాటు చిన్నారుల సంరక్షణకు ఇబ్బందులు తప్పడంలేదు. కాగా ఇసుకలపాలెం శ్మశానవాటికపనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతోపాటు నిర్మాణాలు పాడవుతున్నాయి. దీనికితోడు పరిసరాలు ముళ్లపొదలతో నిండిపోవడంతో అంత్యక్రియల నిర్వహణకు గ్రామస్థులు ఇబ్బందిపడు తున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీకేంద్రాలతో పాటు వాటిక పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

పీజీటీల పదోన్నతులపై దృష్టి సారించాలి

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న రవికుమార్, పొందూరు మండల నాయకులు

ఆమదాలవలస/ పొందూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో 14 సంవత్సరాలుగా దీర్ఘకాలిక సమస్యగా ఉన్న టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. మంగళవారం శాసనసభలో మాట్లాడుతూ రాష్ట్రంలో 126 సైన్స్ కళాశాలల్లో 86 మంది ఉపాధ్యాయులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యపై 2010లో కమిటీ విచారణ కూడా చేపట్టినట్లు తెలిపారు. మళ్లీ 2023లో కూడా ఇదేసమస్యపై మరో కమిటీ రాష్ట్రంలో విచారణ పూర్తి చేసిందని చెప్పారు. అధికారులు స్పందించి ఆ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. 8, 9, 10 తరగతుల్లో బోధిస్తున్న టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయులు పదోన్నతులకోసం నిరీక్షించడానికి అధికారులు నిర్లక్ష్యమే కారణమని తెలిపారు.

చంద్రబాబును కలిసిన నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌తోకలిసి పొందూరు మండలానికి చెందిన ఏఎంసీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకరభాస్కర్ కలిశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులకు చంద్రబాబునాయుడు సూచించారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేసి పూర్తి చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా 2029 నాటికి అందరికీ సొంత ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పీఎంఏవై 1.0లో ఇళ్లు, పీఎంఏవై, పీఎంజన్‌మన్ పథకంలో మంజూరై వివిధదశల్లో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన గృహాల నిర్మాణాలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.ఐదు వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీ జీటీలకు రూ.లక్ష ఆర్థికసాయం చేయనున్నట్టు తెలిపారు.

జాడుపూడి ఆర్‌ఎస్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన

- ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



విప్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాడుపూడి ఆర్‌ఎస్ గ్రామస్థులు

కవిటి, మార్చి18(ఆంధ్రజ్యోతి): జాడుపూడి ఆర్‌ఎస్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి మంత్రికి అందజేశామని, నిధులు విడుదలైన వెంటనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆర్‌ఎస్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేయించాలని జాడుపూడి ఆర్‌ఎస్ గ్రామస్థులు, టీడీపీ మండలాధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, నేతలు సంతోషపట్నాయక్, భీమారావురౌతో, బాసుదేవ్‌రౌతో విజయవాడలో విప్ బి.అశోక్‌కు వినతిపత్రం అందజేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. సోమవారం రాత్రి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు, అంబేద్కర్ యూనివర్సిటీ, ఐఐటీ తదితర విద్యాసంస్థలకు సంబంధించిరైతులు సాగునీటికి పడుతున్న అవస్థలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లుఈశ్వరరావు తెలిపారు.

కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వండి

- జిల్లా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్

అరసవల్లి/గుజరాతీపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని జిల్లా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్‌చేశారు. మంగళవారం శ్రీకాకుళంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణ ఆధ్వర్యంలో నిరసనప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షనర్లకు ప్రభుత్వం నిత్యావసరాలను సరఫరా చేయాలని, ప్రయాణ ఖర్చుల్లో రాయితీ, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, పి.వాసుదేవరావు, బి.శివాజీ పాల్గొన్నారు.

నూతన వంగడాలు కనుక్కోవాలి

ఎచ్చెర్ల, మార్చి18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వంగడాలను కనుక్కోవాలని వ్యవసాయ విద్యార్థులకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఎస్ఎస్ఆర్‌పురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు తయారుచేసిన వ్యవసాయక్షేత్రాలు, అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించారు.కార్యక్రమంలో నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి, అసోసియేట్ డీన్ కె.మోహ్‌కిశోర్, దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఎస్సీ-98 ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

కంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):డీఎస్సీ-98 బ్యాచ్ ఉద్యోగుల సర్వీస్ 62 ఏళ్ల వరకు క్రమబద్ధీకరించాలని ఎంటీఎస్ రాష్ట్ర సంఘంసభ్యులు కోరారు.ఈ మేరకు మంగళవారం జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును అమరావతి సచివాలయంలో ఎంటీఎస్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి శ్రీనివారరెడ్డి, ప్రధానకార్యదర్శి కామేష్‌రెడ్డి, కోశాధికారి సుందరశాస్త్రీ, సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ఏడాది మొత్తం(12నెలలు)జీతం చెల్లించాలని కోరారు.

జామ్‌లో సత్తాచాటిన ఇచ్ఛాపురం విద్యార్థినులు

ఇచ్ఛాపురం,మార్చి18ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం ప్రభుత్వడిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఐఐటీ జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ (జామ్)లో సత్తాచాటారు. ఐఐటీల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో బాకిఈశ్వరి(467),గుడియాజ్యోతి(786), బాడిత్య పూజిత(1333)ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినులతోపాటు కెమిస్ట్రీ లెక్చరర్ ఎస్.శివకుమార్‌కు ప్రిన్సిపాల్ రామిన్‌కుమార్‌పాడి మంగళవారం అభినందించారు.

బ్యాట్ పట్టి.. బాల్‌వేసి

- అసెంబ్లీ ప్రజాప్రతినిధుల క్రికెట్ పోటీల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు



శ్రీకాకుళం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ ప్రజాప్రతినిధులకు మంగళవారం అమరావతిలో నిర్వహించిన క్రికెట్‌పోటీల్లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు బ్యాటింగ్, బౌలింగ్‌లో తమ ప్రతిభచూపారు.

పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే, రెవెన్యూ సదస్సులు, ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గోకులాలు పూర్తిచేయాలని ఆదేశించారు. మార్కెటింగ్, ఉద్యాన, పరిశ్రమలు, గృహ నిర్మాణ,మత్స్య శాఖల లక్ష్యాలు, ప్రగతిని సమీక్షించారు. ఎంపీడీవోలు సాంఘిక సంక్షేమశాఖ సిబ్బందితో సమీక్షించి వసతి గృహాల భవనాల మరమ్మతులపై చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానమంత్రి సూర్య ఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉపకలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డ్వామా పీడీ సుధాకర్, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఏడీపై చర్యలకు ఉత్తర్వుల జారీ

శ్రీకాకుళం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయశాఖ పరిధిలో 2016-19 మధ్య కాలంలో ఎన్ఎఫ్ఎస్ఎం పథకం కింద మంజూరైన ఇన్‌పుట్ రాయితీలో లోపాలు చోటుచేసుకున్నాయని, అప్పట్లో లావేరు మండలంలో అక్రమాలు జరిగాయని తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రణస్థలంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరక్టర్‌గా విధులు నిర్వహించిన కె.చంద్రరావు హయాంలో రూ. 27,7,706 దుర్వినియోగమయ్యాయని, ఈవిషయంపై విచారణ నిర్వహించి, చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేశారు. ప్రస్తుతం చంద్రరావు విజయనగరం జిల్లా రాజాం వ్యవసాయశాఖ ఏడీగా కొనసాగుతున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జిల్లాలోని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారుల నియామకం, పోలింగ్ బూత్‌లకు సంబంధించిన అంశాలపై చర్చించి, పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలపై సమీక్షించారు. సమావేశంలో టీడీపీ, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం పార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు, సిరిపురపు తేజేశ్వరరావు, ఆర్.శంకరరావు, కేఎల్ఎస్ కుమారి, ఎల్.సోమేశ్వరరావు, ఎం.గోవర్ధనరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

అరసవల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి):ఓటర్లజాబితా తయారీకి సలహాలు, సూచనలు అందజేసి సహకరించాలని ఆర్డీవో సాయి ప్రత్యూష కోరారు. శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో తహసీల్దార్లు ఎస్.గణపతిరావు, పద్మావతి, డీటీ జీకే శ్రీనివాసరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు మాదారపు వెంకటేష్, కుమారి, ఎ.శ్రీనివాసరావు, ఆర్.పురుషోత్తం పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

జి.సిగడాం, మార్చి18(ఆంధ్రజ్యోతి):బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంపతిరావు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం జి.సిగడాంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు విష్ణుమూర్తి, వజ్జపర్తి రఘురాం,బూరాడ వెంకటరమణ, అప్పారావు, గట్టెం అప్పలరాజు, ముద్దాడ త్రినాథరావు, పొగిరి దాశరధి పాల్గొన్నారు.

322 మంది లబ్ధిదారులకు అదనపు సాయం

జి.సిగడాం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో 322 మంది ఇళ్ల లబ్ధిదారులకు అదనపు సహాయం అందజేస్తామని మండల ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం జి.సిగడాంలో గృహనిర్మాణాలపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవోరామకృష్ణ, గృహనిర్మాణశాఖ ఏఈ యువరాజు, ఏపీవో సత్యనారాయణ, ఈసీ పురుషోత్తమరావు, సురేంద్ర పాల్గొన్నారు.

ఒకే మాట మీద నిలబడిన వ్యక్తి రాముడు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీలో గల పంచాయతన వరసిద్ధివినాయక ఆలయంలో మంగళవారం విశ్రాంత ప్రొఫెసర్ నిక్కు అప్పన్న రచించిన నేను నాజన్మభూమి బుడితి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాముడొచ్చాడు అన్న అంశంపై ఆధ్యాత్మిక వేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ మాట్లాడుతూ రాముడు ఒకేమాట మీద నిలబడి, సత్యమనే బాణాన్ని సంధించేవాడని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, మల్లీశ్వరరావు, కోమలరావు, పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి, జంధ్యాల శరత్ బాబు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి

రణస్థలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళిక ప్రకారం చదవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల అకడమిక్ మోనటరింగ్ అధికారి కె.ధర్మకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వేసవిలో విద్యార్థులు తీసుకోవలిసిన జాగ్రత్తల కోసం వివరించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

30 మందికి ఫిజియోథెరపీ

ఇచ్ఛాపురం,మార్చి18(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురంలోని ముత్యాలమ్మపేట ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో 30 మందికి ఫిజియోథెరపీని మంగళవారం ఫిజియోథెరపిస్టు బి.అమూల్య నిర్వహించారు.కార్యక్రమంలో హెచ్ఎం శివకుమార్, సూర్యం, సోమేష్, స్పెషల్ ఎడ్యుకేటర్ తేజేశ్వరరావు, సోనియా పాల్గొన్నారు.

51 రాయితీ యూనిట్ల మంజూరు

నరుబుజ్జిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు కోసం ఈనెల 22లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. ఈమేరకు బీసీల్లో వివిధ కేటగిరీలకు సంబంధించి 51 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. యూనిట్‌కు 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.ధ్రువపత్రాలతో సచివాలయంలో లేదా ఏదైనా ఇంటర్నెట్ కేంద్రం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను అందిపుచ్చుకుని, నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు ప్రభుత్వోద్యోగులకు జరిగే కంప్యూటర్ శిక్షణ ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఎక్సెల్ షీట్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు.

అత్యవసర సేవలతో తల్లీబిడ్డలకు రక్షణ

అరసవల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి):అత్యవసర సేవలతో తల్లీబిడ్డకు రక్షణ లభిస్తుందని డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ తెలిపారు. మంగళవారంశ్రీకాకుళంలోని సర్వజనఆసుపత్రి ప్రసూతి విభాగాధిపతి డి.పార్వతి ఆధ్వర్యంలో గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు మొబైల్‌నెంబర్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలమురళీకృష్ణ మాట్లాడుతూ మొబైల్‌నెంబర్ ద్వారా గ్రామాల్లో అత్యవసర సమయాల్లో గర్భిణులను రిఫరల్‌ఆసుపత్రికి చేరవేసి వైద్యసేవలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. మొబైల్ నెంబర్‌ను అన్నిసీహెచ్‌సీలకు తెలిపారు. కార్యక్రమంలో రవి వెంకటాచలం పాల్గొన్నారు.

13న మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష

కవిటి, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఒడియా పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న జిల్లా స్థాయి మేధాసమ్మాన్ ప్రతిభాపరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) అధ్యక్షుడు కేశవపురియా, కార్యదర్శి మనోజ్‌కుమార్ మహారణ తెలిపారు.మంగళవారం సహలాలపుట్టుగలో అసోసియేషన్ సభ్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్షకు ఈనెల 25లోగా విద్యార్థులు పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు. ఈప్రాంత ఒడియా విద్యా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే, విప్ బి.అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కంచిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) :స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం పది గంటలకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీవో ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.తిరుమలరావు, ఏపీవో జి.ధనుంజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని 31 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కులగణన తర్వాత వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలి

గుజరాతీపేట,మార్చి18(ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాత ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు అర్జికోటిలు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలు, రెల్లిలు వాటి అనుబంధ కులాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు వై.గురుమూర్తి,ఎస్.రమణ,పి.చంటి, ఎస్.సూర్యనారాయణ, అబ్బాస్, ఎ.ఈశ్వరరావు, డి.మోహన్, తిరుపతిరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ఇచ్ఛాపురం,మార్చి18(ఆంధ్రజ్యోతి): కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006లో పదో తరగతి చదువుకున్న 63మంది పూర్వ పాఠశాలలో భోజన హాల్ నిర్మాణానికి రూ.58వేలు హెచ్ఎం నరేంద్రనాద్ పట్నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు హెచ్ఎం అభినందించారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం, మార్చి18(ఆంధ్రజ్యోతి):ఒడిశాలో కొనుగోలు చేసిన 21 కేజీల గంజాయిని గుంటూరుకు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఇచ్ఛాపురంలో సీఐ మీసాల చిన్నమనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావుతో కలిసి డీఎస్పీ వెంకటప్పారావు విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు..ఒడిశాలోని డెంకానాల్ జిల్లా సువా గ్రామానికి చెందిన తపన్ సమాల్ అలియాస్ తుఫాన్ అక్కడ కొనుగోలు చేసిన 21కేజీల గంజాయితో ఇచ్ఛాపురం బస్సులో చేరుకున్నాడు. తుఫాన్ గుంటూరులో ఓ డాబా వద్ద గంజాయి సేవించడానికి వచ్చే తమిళనాడుకు చెందిన ముతురాజ్ సుందర్‌రుదిర సమితో పరిచయం ఏర్పడింది. గంజాయిని తీసుకొచ్చి ఇస్తే కేజీకి రూ.15వేలు ఇస్తామని ఆయనతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో ఒడిశాలోని గలపాడులో కేజీ గంజాయి రూ.7,500 చొప్పున 21.040కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. కొనుగోలుచేసిన గంజాయితో గుంటూరు వెళ్లేందుకు బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నాడు.అక్కడ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే క్రమంలో రత్తకన్న ఎల్‌సీ గేటు వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఆయన వద్ద ఉన్న గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు

బూర్జ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పపేటకు చెందిన బొల్లు సూరిబాబు కుమార్తె రోడ్డు ప్రమాదానికి గురికావడంతో చికిత్సకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.9 లక్షల 20 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను కుటుంబ సభ్యులకు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణం నాయుడు, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అందజేశారు.

క్రైం కార్నర్

బాలికపై మేనమామ అకృత్యం

కవిటి, మార్చి18(ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై మేనమామ అకృత్యానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి గతంలో వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసయ్యాడు. గ్రామంలో యువకుడి ఇంటికి కొద్ది దూరంలో బాలిక కుటుంబం నివసిస్తోంది. ఇటీవల బాలిక తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో శ్రీకాకుళంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు యువకుడు బాలికపై ఈ నెల 11న అకృత్యానికి పాల్పడ్డాడు. ఈ తరుణంలో బాలిక ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్థులు తల్లికి సమాచారమిచ్చారు. దీంతో కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం రాత్రి కవిటి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి కేసును నమోదు చేస్తామని ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం హెచ్‌బీకాలనీ మైదానంలో రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగర శివారులోగల తోటపాలెంకు చెందిన లొట్టి సురేష్ ఏపీహెచ్‌బీ కాలనీ మైదానంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. స్థానికులు ఆయన ప్రవర్తనపై అనుమానంతో పోలీసులకు సమాచారాన్ని అందించారు. దీంతో ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ సిబ్బందితో వెళ్లి సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద రెండు కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమైంది. దీంతో సురేష్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఇద్దరు యువకుల అరెస్ట్

శ్రీకాకుళంలోని అరసవల్లి జంక్షన్ 80 ఫీట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఇద్దరు యువకులు ఒకటో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక మొండేటి వీధికి చెందిన డి.అఖిల్‌సాయి, ఎచ్చెర్ల మండలం ఏజీపేటకు చెందిన భానుప్రసాద్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారమిచ్చారు. దీంతో ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ, సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ద్విచక్రవాహనాలు దొంగతనం చేసినట్టు ఒప్పు కున్నారు. ఈ మేరకు తుప్పల్లో దాచి ఉంచిన ద్విచక్ర వాహనాలను చూపించారు. శ్రీకాకుళం రూరల్ పరిధిలో రెండు వాహనాలు, ఎచ్చెర్లలో ఒకటి, రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాన్ని చోరీ చేసినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసులను నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మళ్లీ వసప తోటలకు ఏనుగులు

● కంటిమీద కునుకులేదని గ్రామస్థుల ఆవేదన


వసప తోటల్లో తిరుగుతున్న ఏనుగులు

కొత్తూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గడచిన వారం రోజులుగా ఏనుగుల సంచారంతో కంటి మీద కునుకు లేకుండా ఉందని వసప, కుంటిభద్ర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కుంటిభద్ర తోటల్లో తిష్ఠ వేసిన ఏనుగులు మంగళవారం ఉదయం రెండు ఏనుగులు కుంటిభద్ర తోటల్లో సంచరించగా మరో రెండు కడుము తోటల్లో చెట్ల కింద సేదతీరాయి. దీంతో తోటలకు వెళ్లిన రైతులు ఏనుగులను చూసి పరుగులు తీశారు. సాయంత్రానికి నాలుగు ఏనుగులు వసప తోటలకు చేరాయి. దీంతో పంటల నష్టం అంచనా వేసేందుకు అటవీశాఖాధికారులు వెళ్లలేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులు ఏవైపు నుంచి వచ్చి పంటలను ధ్వంసం చేస్తాయోనని వాపోతున్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి..

● పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఎంజీఆర్


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

కొత్తూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలానికి చెందిన పలువురు వైసీపీ కీలక నేతలు టీడీపీలో చేరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో వారికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, పారాపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుంచల నూకరాజు, గోగుల వరప్రసాదరావు తదితరులున్నారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిరంకుశ పాలన నచ్చక, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, ఎమ్మెల్యే ఎంజీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషికి తామంతా ఆకర్షితులమై టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో అగతముడి మాధవరావు, మాతల గాంధి, ఎ.అరుణకుమార్, టొంపల తిరుపతిరావు, చింతాడ కోటి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపుల్లో తేడాలపై క్షేత్రస్థాయి పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

జలుమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కూడలి నుంచి గ్రామం వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లింపుల్లో హెచ్చు తగ్గులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య తెలిపారు. పరిహారం చెల్లింపులో తేడాలు న్నాయని బాధితులిచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తు న్నామని చెప్పారు. అప్పట్లో జాతీయ రహదారి అధికారులు గుర్తించిన నష్ట పరిహారం జాబితాను అవార్డు చేశామన్నారు. అందులో వచ్చిన హెచ్చు తగ్గులపై వాస్తవాలు తెలుసుకుంటున్నామన్నారు. తేడాలుంటే లబ్ధిదారులకు న్యాయం చేసేలా చర్యలు తీసకుంటామన్నారు. తహసీల్దార్ రామారావు, భూ విభాగం డీటీ సంతోష్‌కుమార్, హైవే డీఈ సత్యభాస్కర్, జేఈ రఘు, సర్పంచ్‌లు రామచంద్రరావు, స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నరసన్నపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను ఏప్రిల్ నాటికి శతశాతం పూర్తి చేసే లా లబ్ధిదారులకు అగాహన కలిగించాలని నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన సూచించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, పట్టణ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఉప సర్పంచ్ కృష్ణబాబు, ఏఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్నాయ్

● ఇటు పొలాలు, అటు చెరువులు ● నీరు లేక అల్లాడుతున్న రైతులు
● బోరుబావుల్లోనూ తగ్గిన నీటిమట్టం ● మార్చిలోనే ఇలా ఉంటే..?


పలాస రూరల్: మహాదేవపురంలో పూర్తిగా ఎండిపోయిన చెరువు (ఇన్‌సెట్‌లో) అల్లుకోల వద్ద ఎండిపోవడానికి సిద్ధంగా ఉన్న హరిసాగరం

పలాస రూరల్/కోటబొమ్మాళి/నందిగాం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క ఎండల తీవ్రత పెరుగుతోంది.. మరో పక్క రబీలో సాగు చేసిన పంటలకు నీరు లేక పొలాలు బీటలు వారుతున్నాయి.. ఇంకోపక్క గ్రామాల్లోని చెరువులు ఎండిపోతున్నాయి.. దీంతో నీరు లేక రైతులు అల్లాడుతున్నారు. పంటలను కాపాడుకోలేక, ఎండిపోతున్న పంటలను చేసి ఓర్చుకోలేక ఆవేదనకు గురవుతున్నారు. మార్చి నెలలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకా ఎలా ఉంటుందోనని ఊహించుకుని ఆందోళనకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి కోటబొమ్మాళి, పలాస, నందిగాం మండలాల్లో నెలకొనడంతో రైతులు వర్షం కోసం చకోరాల్లా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వర్షాభావ పరి స్థితుల్లో ఇప్పటికే బావుల్లో నీరు అడుగంటగా చెరువులు బీటలు వారి కనిపిస్తున్నాయి. ● పలాస మండలంలో ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటైన హరిసాగరం పూర్తిగా ఎండిపోగా, లొత్తూరు సాగరం, వరహాల గెడ్డల్లో మరో కొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తు న్నాయి. పొలాల్లోని బోరుబావుల్లో కూడా నీటి మట్టం తగ్గిపోవడంతో వారు ఆవేదనకు గురవు తున్నారు. మార్చి నాటికే ఈ పరిస్థితి ఉండగా రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకా శాలున్నాయని పలు వురు అభిప్రాయపడుతున్నారు. ● కోటబొమ్మాళి మండలంలో రబీ పంటలపై రైతులు ఆశలు వదులు కుంటున్నారు. వంశధార కాలువపై ఆధారపడిన వరి నాట్లు వేశారు. అయితే గొట్టాబ్యారేజీలోనే నీరు అడు గంటడంతో కాలువ ద్వారా నీరు నామమాత్రంగా వస్తుండడం, అది పంటలకు ఏమాత్రం చాలకపోవడంతో రైతులు ఆవే దనకు గురవుతు న్నారు. దీంతో చెరువుల్లో ఉన్న నీటిని ఇంజన్లతో తోడుతున్నప్పటికీ చాలడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నాటిన వరి, శనగ పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ● నందిగాం మండలం లోని పలు గ్రామాల్లో రబీ కింద సాగు చేసిన వేరుశనగ పంట ఎండకు ఎండుతోంది. డిసెంబరులో పడిన వర్షాలతో పంట దెబ్బ తినగా మిగతా పంట కూడా ప్రస్తుతం నీరు లేక ఎండిపోవడంతో పంటలపై ఆశలు వదులుకున్నారు. నరేంద్రపురం, వేణుగోపాలపురం, నారాయణపురం, కొండపేట, మణిగాం తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. అందుబాటులో ఉన్న చెరువులు, బావుల్లో ఇంజన్ల ద్వారా నీరు పెట్టినప్పటికీ పంట చేతికొస్తుందనే నమ్మకం లేకపోతోం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగు నీరందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురం, నందిగాం: నరేంద్రపురంలో ఎండిపోయిన వరి, వేరుశనగ పంటలు

సమన్వయంతో పనిచేయండి

పాతపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు సంబంధించి అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, ఎంఈవోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 15 ఆదర్శ ప్రాథమిక పాఠ శాలలు ఏర్పాటు చేయాల్సి ఉండగా పాతపట్నం మెయిన్, బినయ్, ఒడియా పాఠశాలలు, చంగుడి, పెద్దలోగిడి, తెంబూరు, తామరలలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు అందరినీ సమన్వయ పరచడం జరిగిందని అధికారులు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కవచంగా శక్తి యాప్

నరసన్నపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ కవచంగా శక్తి యాప్ పనిచేస్తుందని శక్తి టీం ఎస్‌ఐ బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానికంగా ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో శక్తియాప్‌పై అవగాహన కలిగించారు. ఈ యాప్ ద్వారా తప్పిపోయిన పిల్లలు వివరాలు, అక్రమ కార్యకలాపాలపై ఫిర్యాదు, రాత్రివేళల్లో భద్రతతో కూడిన ప్రయాణం చేకూర్చడం జరుగుతుందన్నారు.

ఓటరు జాబితాలపై అభ్యంతరాలుంటే తెలపండి

టెక్కలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని టెక్కలి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర అంశాలపై సూచనలు, సలహాలివ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీల నేతలు బగాది శేషగిరిరావు, బోయిన రమేష్, వెలమల కామేశ్వ రరావు, టీబీజీ గుప్త, బోకర నారాయణరావు, జర్జాన రామ్‌జీ, నడుపూరు లక్ష్మీనారాయణ, పరమేసు పాల్గొన్నారు.

కుటుంబం ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో..

పాతపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకురావాలని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధరరాజా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నిర్వహణ తదితర అంశాలను వివరించి నేతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు జాబితాల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న నేతలు

మెళియాపుట్టి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల బతుకులను మార్చి వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన సంఘం, టీడీపీ నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం అంపురం గ్రామంలో గిరిజనులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చేసేందుకు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షణీయ మన్నారు. వైసీపీ ప్రభుత్వం గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారినే మోసం చేసిందని విమర్శించారు. గిరిజన సమస్యలపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అసెంబ్లీలో ప్రస్తావించడం, మెళియాపుట్టిలో ఐటీడీఏ వస్తుందని ప్రకటించడం వల్ల గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు. మెళియాపుట్టి మండలానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.25 కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వాబ, జగన్, టీడీపీ నేతలు అనపాన రాజశేఖరరెడ్డి, చక్రి, భైరిగి, పోలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

శ్యామసుందరస్వామి ఆలయ ఆస్తులపై కన్ను

● చదును చేయడంపై విమర్శలు


ఆలయ స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

టెక్కలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున తొలుసూరుపల్లి రోడ్డులో ఉన్న శ్యామ సుందర స్వామి ఆలయానికి చెందిన ఆస్తులపై ఆక్రమణదారుల కళ్లు పడ్డాయి. కోట్లాది రూపాయల విలువచేసే ఈ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మంగళవారం సదరు స్థలాలను చదును చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆలయానికి సంబంధించి సర్వే నెం.531/18లో 1.22 ఎకరాల స్థలం ఉంది. ఇప్పటికే ఈ ఆలయానికి చెందిన కొన్ని స్థలాలు కొంతమేర అక్రమార్కులు కబ్జాచేశారు. దేవదాయశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. 6సీ పరిధిలోకి వచ్చే ఈ ఆలయం పర్యవేక్షణపై ఆ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో ఈ స్థలాలను ఆక్ర మించుకునేందుకు కొందరు పెద్దలు ప్రయ త్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఈ స్థలాన్ని చదును చేసి పిచ్చి మొక్కలను తొలగించే చర్యలు చేపట్టడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవాలయ స్థలాలను పరిరక్షించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. దీనిపై ఆలయ అర్చకుడు పద్మనాభ పండాను 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా మే నెలలో సుదర్శన యాగం చేసేందుకు స్థలాన్ని చదును చేస్తున్నానని, మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వెళ్లలేదని, దేవదాయశాఖ ఏసీకి గతంలో మౌఖికంగా తెలియజేశానని ఆయన పేర్కొన్నారు.

బాలలకు రక్షణ కవచంలా ఉండాలి

● ఆ బాధ్యత సచివాలయ మహిళా పోలీసులదే..
● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

పలాస, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బాలలు ప్రస్తుతం ప్రమాదకర స్థితిలో ఉన్నారని, వారికి అన్ని విధాలా రక్షణ కవచంలా ఉండే బాధ్యత సచివాలయ మహిళా పోలీసులు తీసుకోవాలని బాలల రక్షణ పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల పర్యవేక్షణ కష్టంగా మారిందని, తల్లిదండ్రులు, గురువుల మాటలను సైతం వారు వినడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ ఏ అసాంఘిక కార్యకలాపాలు జరిగినా అందులో బాలలుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడిన పిల్లలు విలువైన తమ విలువైన బాల్యాన్ని కోల్పోతున్నారని ఉదహరించారు. బాల్య వివాహాల నిరోధానికి అవసర మైన చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు అధ్యక్షతన వహిం చిన కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ, కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, అసిస్టెంట్ లేబర్ అధికారి ఎం.వి జయకుమార్, ఐసీడీఎస్ సీడీపీవో కె.పార్వతి, సూపర్‌వైజర్ యు.లత, చైల్డ్‌హెల్ప్‌లైన్ సమన్వయకర్త కె.శివాజీ, కర్మాగారాలశాఖ సీనియర్ సహాయకుడు ఆర్.శ్రీనివాసరావు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు: ఆర్డీవో


పెట్రోలు బంకు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

ఎల్.ఎన్.పేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రధాన రోడ్లకు ఆనుకుని వ్యాపారాలు చేసుకునే వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేకుంటూ అనుమతులు రద్దుచేస్తామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి స్పష్టంచేశారు. రావిచెంద్రి, మోదుగవలస జంక్షన్‌ల వద్ద చేపడు తున్న పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట పొలాలను వ్యాపారాలకు మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. రావిచెంద్రి జంక్షన్‌లో పెట్రోల్ బంకు పనులను, రికార్డులను పరిశీలించారు. రేషన్ బియ్యం పంపిణీ, గ్రామసచివాలయాల్లో ఈకేవైసీ నమోదు తదితర వివరాలను తహసీల్దార్ జె.ఈశ్వరమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్. గవరయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ఉద్యోగాలు కోల్పోతున్నాం..

● ఆదుకోవాలని మీటర్ రీడర్ల ఆందోళన



టెక్కలిలో ఆందోళన చేపడుతున్న మీటర్ రీడర్లు



పలాసలో ర్యాలీ చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

పలాస/టెక్కలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల వల్ల తాము ఉద్యోగాలు కోల్పోతున్నామని, దీని వల్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని విద్యుత్ మీటర్ల సంఘం నేతలు కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పలాస, టెక్కలిల్లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలాసలో ఏఐటీయూసీ పలాస డివిజన్ నాయ కుడు చాపర వేణుగోపాల్, మీటర్ రీడర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.కుమార స్వామి, కార్యదర్శి దూగాన భాస్కరరావు మాట్లాడు తూ.. గడచిన 20 ఏళ్లుగా ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బిల్లులను తీసుకుంటూ కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారని.. అయితే స్మార్ట్ మీటర్ల వల్ల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనివల్ల కుటుంబాలను ఎలా పోషించుకునేదని ఆవేదన వ్యక్తం చేశా రు. ప్రభుత్వం స్పందించి సంస్థలో ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమాల్లో సంఘం పలాస డివిజన్ అధ్యక్షుడు బి.ఓంకార్, కార్యదర్శి కె.నరేష్, సోంపేట, పలాస, టెక్కలి సబ్ డివిజన్‌లకు చెందిన పలువురు మీటర్ రీడర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

30న ఉత్తరాంధ్రస్థాయి కవి సమ్మేళనం

పలాసరూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకొని జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 30న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి తెలిపారు. ఆరోజు పంచాంగ శ్రవణంతో పాటు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. కవితలు సామాజిక అంశమై ఉండాలని, నాలుగు పద్యాలు గాని, ఇరువది పంక్తులలో కవిత రాసి ఈనెల 25వ తేదీలోగా తెప్పల కృష్ణమూర్తి 94403 34110 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపించాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు..

చిన్నగురుదాసుపురంలో ఎంప్లాయిస్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి మూడురోజుల పాటు జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు 70639 42370, 90735 27344 నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

టెక్కలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ సంఘ నాయకులు అన్నారు. మంగళవారం టెక్కలిలో సమావే శమై భవిష్యత్ కార్యాచరణ, పలు అంశాలపై చర్చించారు. నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకు నేలా ప్రజాప్రతినిధు లకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.రామారావు, వెంకటటావు, వీరాస్వామి, చిన్నారావు, అప్పారావు పాల్గొన్నారు.

రూ.1.40 లక్షలకు జీడితోట వేలం ఖరారు

పోలాకి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోడూరులో మండల పరిషత్ ఆధీనంలో ఉన్న జీడిమామిడితోటను రూ.1,40,500లకు వేలంపాట ఖరారు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జీడి మామిడి తోటకు వేలంపాటను ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాట రూ.1,32,400లుగా ప్రకటించగా కరుకోల రమేష్‌బాబు రూ1,40,500లకు పాడడంతో ఖరారు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, సూపరింటెండెంట్ బలగప్రకాష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

వజ్రపుకొత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంపల్లి పంచాయతీ శివరాంపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ జిల్లా నాయకుడు బమ్మిడి ఆనందరావు తదిత రులు గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గల్లి జంక్షన్ నుంచి శివరాంపురం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2018, 2020లో రెండు పర్యాయాలు శిలాఫలకాలు వేసినా ఇప్పటివరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదని అన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఉద్దానం, జలజీవన్ కుళాయిలు లీకవుతుండడంతో తాగునీరందడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

పాతపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలువురు పంచాయతీ కార్య దర్శులుగా పదోన్నతి పొంది మండలానికి కేటాయించబడ్డారని ఎంపీడీవో పి.చంద్రకుమారి తెలిపారు. బడ్డుమర్రికి చిన్నింటి సూర్యం, పెద్దమల్లిపురానికి జె.శివ, కాగువాడకు టి.ప్రభాకర్ సమత, గంగువాడకు మడపాన కూర్మారావు, తీమరకు డి.పవన్ కుమార్ కార్యదర్శులుగా మంగళవారం బాధ్యతలు మంగళవారం స్వీకరించారన్నారు.

మద్యం తాగి.. విచక్షణ మరిచి..

(ఐదో పేజీ తరువాయి)

సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తున్న నాగమ్మతో గొడవ పడ్డాడు. అంతటితో ఆగకుండా తోటలు కొట్టేందుకు వినియోగించే కత్తితో ఆమె తలపై, నుదుటిపై, మెడపై దాడిచేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన తెలుసుకుని స్థానికులు, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. అయితే సుమారు 20 ఏళ్ల కిందట నాగమ్మను అప్పలరెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. కాగా, హత్య చేసిన అనంతరం అప్పలరెడ్డి తాను దాడి చేసిన కత్తితో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మంగళవారం ఉదయం జేఆర్ పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వి.సందీప్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. క్లూస్‌టీమ్ వివరాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు. అక్కడికి శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద కూడా చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుమారుడు త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎం.అవతారం తెలిపారు.